క్లుప్తంగా

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టులో నందిగామ విద్యార్థి



పోసిపోగు నవీన్

సత్తెనపల్లి: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పోసిపోగు నవీన్ ఎంపికయ్యాడు. వినుకొండలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -17 ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. రాష్ట్ర జట్టులో స్థానం సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకరపర్తి శ్రీనివాసరావు తెలిపారు. పోట్లూరి తేజ (గోల్ కీపర్) జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. నవీన్‌ను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగభైరు సురేష్ కుమార్, ప్రధానోపాధ్యాయులు కాకరపర్తి శ్రీనివాసరావు, పీడీ లాకు పిచ్చియ్య ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా ఖో-ఖో జట్టుకు విద్యార్థి ఎంపిక



దర్శి కిరణ్‌కుమార్

క్రోసూరు: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థి దర్శి కిరణ్‌కుమార్ జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మేరీసుజన్ బుధవారం తెలిపారు. మంగళవారం కారంపూడిలోని బ్రహ్మనాయుడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 విభాగం ఖోఖో పోటీల్లో పాల్గొన్న కిరణ్‌కుమార్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో అంతర్జిల్లాల పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రిన్సిపల్‌తో పాటు పీఈటీ సీహెచ్ నరసింహారావు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి



అచ్చంపేట: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఓ నాగ శ్రీనివాస్ మాట్లాడుతూ 78 రకాల ఉపాధి పనులున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు



ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం మదర్సా వద్ద ఈదురు గాలులతో పాటుగా కురిసిన వర్షానికి రహదారి వెంబడి భారీ వృక్షాలు నేలకొరిగాయి. నరసరావుపేట-సత్తెనపల్లి ప్రధాన రహదారి కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై వి.సోమేశ్వరరావు సిబ్బందితో పాటుగా ప్రొక్లెయిన్, ట్రాక్టర్ల సాయంతో రోడ్డుపై పడిన చెట్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. వాహనదారులు, ప్రయాణికులు కొద్దిసేపు ఇబ్బందులు పడ్డారు.

న్యాయం చేయండి

కారెంపూడి: తమ కుమారుడిని అతని భార్యే పొట్టన పెట్టుకుందని, న్యాయం చేయాలని కోరుతూ మృతదేహంతో తల్లిదండ్రులు, బంధువులు కారెంపూడి పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుపై బుధవారం సాయంత్రం బైఠాయించారు. మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ శివారు సింగరుట్ల తండాకు చెందిన బాణావతు గోపీ నాయక్ అదే తండాకు చెందిన మేనత్త కుమార్తె హనిమీభాయిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. హనిమీభాయి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, అతనితోపాటు మరో ముగ్గురి సహకారంతో భర్తను అడ్డు తొలగించుకునేందుకు కుట్ర పన్నిందని బంధువులు ఆరోపిస్తున్నారు. మద్యం అలవాటు ఉన్న భర్తకు కూల్‌డ్రింక్ బాటిల్‌లో గడ్డి నివారణ మందు స్వల్ప మోతాదులో కలిపి ఇచ్చినట్టు చెబుతున్నారు. గత బుధవారం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో గుంటూరులోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించామని, చికిత్స పొందుతూ గోపీ నాయక్ మంగళవారం రాత్రి మృతి చెందాడని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్టేషన్ వద్ద నిలిపి ఆందోళన చేశారు.



గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య యువజన సంఘ నాయకుల నివాళులు



మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి కమిషనర్ షమ్మి నివాళి



పెదకూరపాడులో జన చైతన్య సమితి సభ్యుల నివాళి

మహనీయులు మార్గదర్శకులు

- ఘనంగా మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమాలు
- జాతిపితకు, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు ఘన నివాలళి

సత్తెనపల్లి: మహనీయులే నేటి తరానికి మార్గదర్శకులని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, చిట్టా విజయభాస్కరరెడ్డి, రమావత్ కోటేశ్వరరావు నాయక్, అచ్యుత శివప్రసాద్, షేక్ మౌలాలి, పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి), రాజవరపు శివ నాగేశ్వరరావు, కాటేపల్లి శేషు, వల్లెం నరసింహారావు, సంకుల తిరుమలరావు, బండి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

- ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు సింగరి మధుసూదనరావు గాంధీచౌక్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. నాయకులు దేవరపల్లి కాశీ, నోముల వెంకటరమణ, అనుమాలశెట్టి వెంకటేశ్వర్లు, సురేప్రసాద్, మాడా నాగరమేష్, కొత్తూరి విశ్వేశ్వరరావు, చిలకల శ్రీనివాసరావు, కొత్త లక్ష్మయ్య, పోతుగంటి రామకోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.
- పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం నూతన అధ్యక్షుడు మాశెట్టి సాత్విక్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అనాథకు, పరివర్తన పాఠశాలలో దుప్పట్ల పంపిణీ చేశారు. నాయకులు చిల్లంచర్ల కల్యాణ్, మద్ది వెంకటేశ్వరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.
- మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కొలిమి షమ్మి గాంధీజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మహాత్మా గాంధీ సేవలను కొనియాడారు. మున్సిపల్ మేనేజర్ సాంబశివరావు, సెక్షన్ హెడ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నేతల నివాళి

పెదకూరపాడు: పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పొందాలని ఎమ్మెల్యే ప్రవీణ్ ఈ సందర్భంగా చెప్పారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

అచ్చంపేట: స్థానిక ఆంజనేయస్వామి విగ్రహ సెంటర్లోని మహాత్మా గాంధీ విగ్రహానికి బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు కూడా పూలదండలు వేసి, నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ గంగసాని బాబు, అచ్చంపేట సర్పంచ్ వీరబాబు, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ సుభాని, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

- స్థానిక సీతారామస్వామి విగ్రహం ముందు గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు రమేష్, జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కోటిలింగం, దేవరశెట్టి శ్రీనివాసరావు, పులిపాటి పిచ్చయ్య, శేషగిరిరావు, శ్రీనివాసరావు, నగేష్ పాల్గొన్నారు.

పెదకూరపాడు: జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు, ఆర్యవైశ్య సంఘ నాయకుడు కొప్పురావూరి సత్యనారాయణ పెదకూరపాడులో మహాత్మా గాంధీ జయంతి బుధవారం నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. విశ్రాంత ఉద్యోగి పేరేచర్ల వెంకటేశ్వర్లు, సమితి కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్, షేక్ లియాఖత్ అలీ, రామినేని శ్యామ్ పాల్గొన్నారు.

అమరావతి: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు బుధవారం పార్టీ ఆధ్వర్యంలో స్థానికంగా మహాత్మా గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంగిశెట్టి కోటేశ్వరరావు, షేక్ హస్మి, అలా లక్ష్మీనారాయణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: మండల ఆర్యవైశ్య సంఘం, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పీహెచ్‌సీల్లో వైద్యులు మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీవో బి.మహేష్ బాబు మాట్లాడుతూ బాపూజీ ఆశయాలు కొనసాగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, సర్పంచ్ చందమామ, ఆర్యవైశ్య నాయకులు, డాక్టర్ శిఖాశాంసన్ ఉన్నారు.

బెల్లంకొండ: జాతిపిత మహాత్మా గాంధీజీ అడుజాడల్లో ప్రతీ ఒక్కరూ నడవాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలలో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. బెల్లంకొండ సచివాలయంలో మస్తాన్ షరీఫ్, గ్రామ సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం గాంధీజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. చంద్రాజుపాలెం సచివాలయంలో జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు అఫ్రపున్నీసా బేగం, ఎంపీడీవో హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ వెంకటరెడ్డి, ఏపీవో కోటమ్మ, టీడీపీ నాయకులు ఓర్సు ఆనంద్, గుంజా గంగారావు గాంధీజి చిత్రపటాలకు నివాళులర్పించారు.

ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద చాగంటివారిపాలెం నవ యువతరం ఫౌండేషన్ 4వ వార్షికోత్సవంలో భాగంగా జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొక్కలు నాటారు. కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ పీలా గాయత్రి, ఫౌండేషన్ సభ్యులు సుమలత, వీఆర్వో మాబువలి, అడ్వకేట్ సాయిదుర్గ పాల్గొన్నారు. గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహించారు.

నకరికల్లు: స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. చౌత్రా సెంటర్‌లో ఎస్‌ఐ చల్లా సురేష్ మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిన్ని ప్రసన్న, కూరపాటి పూర్ణచంద్రరావు, కాళంగి రామసుబ్బారావు, షేక్.ఆలీబాషా, కాకుమాను మాధవ్‌కుమార్, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మస్తాన్ షరీఫ్



స్థానిక చౌత్రా సెంటర్‌లో గాంధీ విగ్రహానికి నివాళి



ముప్పాళ్ళలో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు



అచ్చంపేటలో విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేతల నివాళి




అమరావతిలో గాంధీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి



క్రోసూరు పంచాయతీ కార్యాలయంలో నివాళులు

అక్కాబావ క్షమించండి..

- నార్నెపాడు వీఆర్వో సూసైడ్ నోట్ లభ్యం
- దర్యాప్తు ముమ్మరం



వీఆర్వో రాసిన సూసైడ్ నోట్



ముప్పాళ్ళ: మండలంలోని నార్నెపాడు వీఆర్వో సత్తెనపల్లి మల్లికార్జునరావు అదృశ్యంపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఆచూకీ కోసం బృందాలుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు. సమాచారం మేరకు మల్లికార్జునరావు ఆఖరిగా ఉన్న ప్రదేశం నార్నెపాడు గ్రామంలోని డంపింగ్ యార్డు వద్ద పరిశీలించగా.. 'నా చావుకు ఎవరూ కారణం కాదు' అంటూ మల్లికార్జునరావు రాసినట్లుగా ఉన్న సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'ఇల్లు నరకంలా మారిపోయింది, మానసిక ఒత్తిడి తట్టుకోలేక చనిపోవాలని నిర్ణయించుకున్నా. ఎన్నో కలలు కన్నాను కాని, ఆర్థిక పరిస్థితులు చావుకు కారణం కాకపోయినా...ఇంట్లో ఉండే అర్హత నాకు లేదు. అక్కా... బావా నన్ను క్షమించండి. నా వల్ల కావడం లేదు. ఇంట్లో వాళ్ల ఆనందం కోసం పెళ్లి చేసుకున్నా కానీ, అది నా మనసుకి ఎక్కడం లేదు. క్షమించరాని తప్పు చేశాను.' అంటూ ఆ లేఖలో రాసి ఉంది. అందులోని అంశాలను క్షుణ్ణంగా పోలీసులు పరిశీలిస్తున్నారు.

సరఫరా సరళతరం చేయాలి

- రేపు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు



సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా భవన నిర్మాణ రంగ కార్మికులకు న్యాయం చేయడం లేదని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు అన్నారు. ఇసుక కొరతతో పనులు లేక అల్లాడుతున్న కార్మికులు స్థానిక గార్లపాడు బస్టాండ్ సెంటర్ అడ్డా వద్ద బుధవారం రోడ్డెక్కి నిరసన ర్యాలీ నిర్వహించారు. అవ్వారు ప్రసాదరావు మాట్లాడుతూ ఉచిత ఇసుక అని ప్రభుత్వం ప్రకటించడమే కానీ, ఆచరణలో అమలు కావడం లేదన్నారు. జిల్లా చుట్టూ ఇసుక రీచ్‌లు ఉన్నప్పటికీ ఆన్‌లైన్ లో పల్నాడు జిల్లాను చూపించడం లేదన్నారు. అదేమని సచివాలయాల్లో అడిగితే చిత్తూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో బుక్ చేయమంటే చేస్తామని అంటున్నారని చెప్పారు. మరోవైపు సంక్షేమ బోర్డు నుంచి కార్మికుల పథకాలకు సంబంధించి బకాయిలు రూ. 6 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈ నెల 4న సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు జి.సాల్మన్ రాజు, నాయకులు విహెచ్ రామారావు, కె.ఆంజనేయులు, పి.శ్రీను, ఆర్.కొండలు, జార్జి, రాంబాబు, అంకమ్మ రావు, కార్మికులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ముస్తాబవుతున్న అమ్మవార్ల ఆలయాలు
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి 12 వరకు ఉత్సవాలు

సత్తెనపల్లి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సత్తెనపల్లి నియోజకవర్గంలో అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు దర్శనమిస్తున్నాయి. గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహించడానికి భక్తులు, ఆలయ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు నిత్యం వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. కుంకుమ పూజలు ఘనంగా జరగనున్నాయి.

అమ్మవారి అలంకరణలు

దసరా సందర్భంగా అమ్మవారు గురువారం బాల త్రిపుర సుందరి, 4న గాయత్రి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపుర సుందరి, 7న మహా చండీ దేవి, 8న సరస్వతి దేవి, 9న దుర్గాదేవి, 10న మహాలక్ష్మి, 11న మహిషాసుర మర్దిని, 12న రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారు. దశమి రోజున విజయదుర్గ అలంకరణ గావించి, విశేష పూజలు చేస్తారు.

ఆలయాలు ముస్తాబు

మాచర్ల రోడ్డులో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం విద్యుద్దీపకాంతులీనుతోంది. గుంటూరు రోడ్డులోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠం, వెంకటపతి కాలనీలోని శ్రీ నీలంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం, వడవల్లి మహాలక్ష్మమ్మ చెట్టు, మున్సిపల్ కార్యాలయ సమీపంలోని మేదర సంఘ రామాలయం, ఇలా.. పలుచోట్ల దుర్గాదేవి అమ్మవారిని నెలకొల్పి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు.



త్రి శక్తి దుర్గా పీఠంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

ధనంతో అమ్మకు దండలు

అచ్చంపేట: మండల కేంద్రంలో గురువారం శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. స్థానిక సీతారామస్వామి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ఆర్యవైశ్య సంఘం, దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవార్లకు ప్రతి రోజూ అలంకరణలు, ప్రత్యేక పూజలు, భజనలకు ఏర్పాట్లు చేశారు. మొదటిరోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. అమ్మవారి అలంకరణకు నగదు నోట్లతో ఒక దండ, నాణేలతో మరొక దండను ప్రత్యేకంగా తయారు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

- దసరా ఉత్సవాలలో సందర్భంగా గ్రామంలోని ప్రతి దేవాలయం ముందు సాయంత్రం 6 నుంచి రాత్రి 9గంటల వరకు మహిళలు బతుకమ్మను ఏర్పాటు చేసి, పూజలు చేస్తారని, ఆర్యవైశ్య మహిళా విభాగం తెలిపింది. 9 రోజులపాటు అమ్మవారిని రోజుకొక ప్రసాదంతో పూజించి, దసరా రోజును నిమజ్జనోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.



నగదు నోట్లతో దండ



నాణేల మాల

శరన్నవరాత్రి మహోత్సవాలు

క్రోసూరు: దసరా మహోత్సవాల సందర్భంగా గురువారం నుంచి క్రోసూరు వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి 45వ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. పది రోజుల పాటు అమ్మవారు పలు అవతారాల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్గిస్తారన్నారు. తొలిరోజు బాలత్రిపురసుందరిదేవీగా, 4న తేదీ గజలక్ష్మీదేవి, 5న గాయత్రీదేవి, 6న లలిత త్రిపురసుందరీదేవి, 7న అన్నపూర్ణదేవీగా, 8న ధనలక్ష్మి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గామాతగా భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. భక్తులు అశేషంగా పాల్గొని అమ్మవారి ఆశిస్సులు పొందాలని కోరారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

గురజాల రూరల్ : రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగి పలువురికి గాయాలైన ఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గోగులపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం ఇంజమూరి రత్తయ్య, ఇంజమూరి సిపాయి కుటుంబాల్లోని ఇద్దరి మహిళల మధ్య రేగిన చిరు వాగ్వాదం చిలికిచిలికి గాలివానై ఘర్షణకు దారితీసింది. ఇరు కుటుంబాలు కర్రలు, రాళ్లతో పరస్పరం దాడికి దిగారు. ఇంజమూరి సిపాయి, ఇంజమూరి అజయ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ఇంజమూరి నాగభూషణంకు చిన్న గాయమైంది. క్షతగాత్రులను బంధువులు గురజాలలోని సీహెచ్‌సీకి తరలించారు. సీఐ పి.భాస్కర్‌రావు, ఎస్‌ఐ వినోద్ కుమార్ వివరాలు నమోదు చేసుకున్నారు.

పౌష్టికాహారంలో నాణ్యతా లోపాలు

నాదెండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంలో నాణ్యతా లోపాలు తలెత్తుతున్నాయి. నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 287 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, ప్రతి నెలా లబ్దిదారులకు డ్రైరేషన్ పంపిణీ చేస్తుంటారు. బియ్యం, బెల్లం, పాలు, రాగిపిండి, చిక్కీలతో పాటూ ప్రతి నెలా 24 కోడిగుడ్లు అందిస్తుంటారు.అయితే కోడిగ్రుడ్లు చాలావరకూ మురిగిపోతున్నాయని లబ్దిదారులు వాపోతున్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉన్న కోడిగ్రుడ్లు ఇస్తున్నారని, 24 కోడిగుడ్లలో సగానికి పైగా పాడౌతున్నాయంటున్నారు. గుడ్ల లోపల నల్లని బూజు, దుర్వాసన వస్తోందన్నారు. అంతేకాక బాగా చిన్నసైజులో ఉన్న గ్రుడ్లు ఇస్తున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కోడిగ్రుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని నాణ్యమైన కోడిగ్రుడ్లు అందించాలని లబ్దిదారులు కోరుతున్నారు.

బహిరంగ ప్రకటన

30 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం

పిడుగురాళ్ల: అక్రమంగా తరలిస్తున్న 30 రేషన్ బియ్యం బస్తాలు పిగురాళ్ల పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లికి చెందిన కొప్పుల వెంకటేశ్వర్లు తుమ్మల చెరువు గ్రామంలో ఈర్ల దేవి వద్ద నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి, వాహనంలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.మోహన్ తెలిపారు.

రాజకీయ ఒత్తిడితో వేధింపులు

అమరావతి: రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే పోలీసు అధికారులుపై ఒత్తిడి తెచ్చి, గతేడాది కొనుగోలు చేసిన ఇసుకపై కేసులు పెట్టి తరలించుకుపోయారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి అలా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తమ తల్లి వెంకటరాజ్యం అమరావతి-2 ఎంపీటీసీగా పని చేస్తుందన్నారు. గత నాలుగేళ్లుగా తాము ప్రభుత్వం ద్వారా సిమెంట్ రోడ్లు, సైడు కాల్వలు, బోగందాని చెరువులో నివసిస్తున్న ఎస్టీలకు ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను చట్టబద్ధంగా రీచ్‌ల నుంచి కొనుగోలు చేసి, రశీదులు పొందామని చెప్పారు. ఆ ఇసుకలో అత్యధిక భాగం వివిధ పనులకు వాడామని, ఇంకా కొంత మిగిలి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంద మంది అధికార పార్టీ నాయకులు పోలీసు అధికారులపై ఒత్తిడి తెచ్చి పది రోజుల క్రితం ఇసుక దగ్గరుంచి ట్రాక్టర్‌పైన కేసు కట్టి, ఇసుకను సీజ్ చేయించారన్నారు. ఇప్పుడు పోలీసు అధికారులు సుమారు 15 ట్రక్కుల ఇసుకను తరలించుకుపోయారన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన ఇసుక సీజ్ చేసి, కేసు నమోదు చేసి వేధించటం సబబు కాదన్నారు.



అడ్డుగా పడుకున్న లక్ష్మీనారాయణ, వెంకటరాజ్యం



గతేడాది ఇసుక కొనుగోలు చేసిన బిల్లులు